తెలుగు దినపత్రిక

సూర్యోదయ వార్త

ప్రతి అక్షరం ప్రజల కోసం...

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి: 2 | సంచిక : 28 | శుక్రవారం 23.10. 2026 | పేజీలు :4 | వెల: 2



'బ్రహ్మోస్'కు ప్రపంచవ్యాప్తంగా

భారీ డిమాండ్

2027-28 నాటికి 'నెక్స్ట్ జనరేషన్' సిద్ధం

- 'ఆపరేషన్ సిందూర్' సమయంలో యుద్ధరంగంలో తిరుగులేని సత్తా
- బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండీ, సీఈఓ డాక్టర్ జైతీర్థ్ జోషి

హైదరాబాద్ సూర్యోదయ వార్త

భారత్ సైనిక ఎగుమతుల్లో 'బ్రహ్మోస్' సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి అగ్రభాగాన నిలుస్తోందని బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండీ, సీఈఓ డాక్టర్ జైతీర్థ్ జోషి వెల్లడించారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో యుద్ధరంగంలో తిరుగులేని సత్తా చాటిన తర్వాత ప్రపంచ దేశాల నుంచి బ్రహ్మోస్‌కు భారీ డిమాండ్ ఏర్పడిందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో 1,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించేలా బ్రహ్మోస్ పరిధిని విస్తరిస్తున్నట్లు ప్రకటించారు. 2022లో ఫిలిప్పీన్స్‌తో కుదిరిన తొలి చారిత్రక ఒప్పందంతో మొదలైన ప్రస్థానం ఆపరేషన్ సిందూర్ తర్వాత మరింత వేగం పుంజుకుందని బ్రహ్మోస్ సీఈఓ డాక్టర్ జైతీర్థ్ జోషి తెలిపారు. ఈ ఏడాది ఆగ్నేయాసియాలోని మరో రెండు దేశాలు ఇండోనేషియా, వియత్నాంలతోనూ ఒప్పందాలు కుదిరాయని, వీటితో బ్రహ్మోస్ ఎగుమతులు 600 మిలియన్ డాలర్లు దాటనున్నాయని వెల్లడించారు.

2027-28 నాటికి 'బ్రహ్మోస్ నెక్స్ట్ జనరేషన్' తొలి నమూనా సిద్ధం

భవిష్యత్ ప్రాజెక్టుల్లో భాగంగా భారత్‌కు చెందిన DRDO, రష్యా సంస్థ సంయుక్తంగా 'బ్రహ్మోస్-నెక్స్ట్ జనరేషన్ క్షిపణిని అభివృద్ధి చేస్తున్నాయి. పరిమాణంలో చిన్నదిగా, తక్కువ బరువుతో, శత్రు రాదార్లకు చిక్కకుండా ఉండే ఈ అధునాతన క్షిపణి తొలి నమూనా 2027-28 నాటికి సిద్ధమవుతుందని జోషి వెల్లడించారు. ఇది భారత వైమానిక దళ స్ట్రైక్ సామర్థ్యాన్ని మరింత పెంచనుంది. దీంతోపాటు - మిగతా 2 లో..

ముదిరాజులకు బీసీ-ఏపై

మంత్రివర్గంలో చర్చిస్తాం

పండుగ సాయన్న జయంతి సభలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక ప్రకటనలు

- ముదిరాజుల వర్గీకరణపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తాం
- జనాభా లెక్కల్లో తేడాలుంటే ఆధారాలతో సవరిస్తాం
- ప్రభుత్వంలో ముదిరాజులకు సముచిత భాగస్వామ్యం కల్పిస్తాం
- ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలు
- బహుజనుల అభ్యున్నతికి రాహుల్ ప్రధాని కావాలి : సీఎం రేవంత్




హైదరాబాద్ సూర్యోదయ వార్త

ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చే అంశంపై వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇందుకోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో అధ్యయనం చేయిస్తామని వెల్లడించారు. ఈ అంశంలో ఇతర కులాలకు ఉన్న అపోహలు, అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వంలో ముదిరాజులకు సముచిత భాగస్వామ్యం కల్పించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. పండుగ సాయన్న జయంతి సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ ముదిరాజుల అభ్యున్నతి, కులగణన, సామాజిక న్యాయం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

కులగణనతోనే సామాజిక న్యాయం

బ్రిటిష్ పాలనలో చేపట్టిన కులగణన తర్వాత వందేళ్ల కు తమ ప్రభుత్వం తిరిగి కులగణన చేపట్టిందని ముఖ్య మంత్రి తెలిపారు. కులగణన కారణంగానే నేడు ప్రతి కులం తమ జనాభా, హక్కులు, వాటా గురించి బలంగా గళం వినిపించగలుగుతోందన్నారు. తమ జనాభా తక్కువగా నమోదైందని ఎవరైనా భావిస్తే పూర్తి ఆధారాలు సమర్పించాలని, వాటిని పరిశీలించి లెక్కలు సవరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో సరైన జనాభా లెక్కలు లేకపోవడం వల్లే ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చలేకపోయారని - మిగతా 2 లో..



తెలంగాణలో ప్రధాని

మోదీ పర్యటన

- వరంగల్ కేంద్రంగా అభివృద్ధి పనులు
- రైల్వే మ్యాన్ ఫ్యాక్టరింగ్ సెంటర్‌ను జాతికి అంకితం
- డిసెంబర్‌లో తెలంగాణకు రానున్న ప్రధాని మోదీ

2

మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేయండి

- ప్రధాని మోదీకి నెతన్యాహు ఆహ్వానం
- ప్రధాని మోదీతో ఫోన్లో ఇజ్రాయెల్ ప్రధాని



కరువు ప్రకృతిది కాదు.. కాంగ్రెస్ పాపమే!



- 12 లక్షల ఎకరాల్లో పంటలు ఎండుతున్నా సీఎం మొద్దునిద్ర
- వైఫల్యం పాలకులది.. బలిపశువులు అధికారులా?
- రేవంత్‌ది ముందుచూపు లేని పాలన
- కేసీఆర్‌కు పేరొస్తుందనే కక్షతో సాగునీటికి అడ్డుకట్ట
- మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజం

- వివరాలు 2 లో..

డిండికి నీటి తరలింపు ఆపండి

హైదరాబాద్ సూర్యోదయ వార్త

డిండి ప్రాజెక్టుకు పాలమూరు ప్రాంతం నుంచి నీటిని తరలించే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమై వారు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ బృందంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ - మిగతా 2 లో..

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పాలమూరు నేతల విజ్ఞప్తి
- మంత్రితో సమావేశమైన మహబూబ్‌నగర్ నేతలు
- ప్రస్తుత విధానంతో పాలమూరు ఆయకట్టుకు నష్టం తప్పదని ఆందోళన
- ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ





ఎల్‌నినో ప్రభావం ఉన్నా

విద్యుత్ కొరత రాకుండా పటిష్ట చర్యలు

రోజువారీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి 140 మిలియన్ యూనిట్లకు పెంచాలి

యాదాద్రి ప్లాంట్‌కు కోల్ ఇండియా నుంచి ప్రత్యామ్నాయ బొగ్గు సరఫరా

మూతపడిన పరిశ్రమల విద్యుత్ బకాయిలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం

హైదరాబాద్ సూర్యోదయ వార్త

ఎల్‌నినో ప్రభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం, రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ పెరిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో విద్యుత్ కొరత తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రానున్న రబీ, వేసవి సీజన్లలో వ్యవసాయ, గృహ విద్యుత్ అవసరాలను సమర్థంగా తీర్చేందుకు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని రోజుకు 140 మిలియన్ యూనిట్లకు పెంచాలని స్పష్టం చేశారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బకాయిల వసూళ్లపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం టీజీజెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి రోజుకు సగటున 90.97 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోందని అధికారులు వివరించారు. అక్టోబర్ 16న ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి నమోదైనట్లు



ఓరుగల్లుపై అభివృద్ధి జల్లు

- వరంగల్ కోట అభివృద్ధికి ప్రభుత్వ పరిపాలన అనుమతులు
- మొత్తం రూ. 382 కోట్ల విలువైన పనులకు గ్రీన్ సిగ్నల్
- వేయి స్తంభాల గుడి, బస్ టెర్మినల్ వంటి పనులకు ఆమోదం
- ప్రపంచ బ్యాంకు నిధులతో 'కుడా' ఆధ్వర్యంలో పనుల నిర్వహణ

భవిష్యత్తులో వ్యవసాయానికే పెద్దపీట : మంత్రి తుమ్మల



రాజేంద్రనగర్ : భవిష్యత్తు వ్యవసాయానిదేనని, రైతే రాజు అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వినూత్న కార్యక్రమమైన 'రైతు పొలాల్లోకి ఆవిష్కరణలు' కార్యక్రమాన్ని రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంతో పాటు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఖేత్ బచావో అభియాన్' కూడా విస్తృత స్థాయిలో రైతాంగానికి చేరువ కావాలని మంత్రి పిలుపునిచ్చారు. శాస్త్ర ఫలాలు రైతులకు చేరువ కావడంలో ఇంకా లోటుపాట్లు ఉన్నాయని, ఇటువంటి కార్యక్రమాల ద్వారా వాటిని భర్తీ చేయాలన్నారు. యూరియా వాడకాన్ని ఇంకా తగ్గించి భూమి సారాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. సాఫ్ట్‌వేర్ నిపుణులు కూడా పల్లెలకొచ్చి వ్యవసాయం చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన శక్తికి మించి వ్యవసాయానికి సాయం అందిస్తున్నారని మంత్రి వివరించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ప్రపంచమంతా ఎల్ నినో సవాలును ఎదుర్కొంటున్నదని, దానిని అందరూ సమష్టిగా ఎదుర్కోవాలని సూచించారు. రానున్న నెలల్లో తాగునీటికి సైతం చాలా ఇబ్బంది ఉంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు ఆచితూచి అడుగులు వేసి, అవకాశం ఉంటే కేపలం ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని సూచించారు. బోధనా సిబ్బంది నియామకాలు, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల స్టైపెండ్ పెంపు అంశాలను సానుకూలంగా పరిశీలిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. తన రెండేళ్ల కాలంలో విశ్వవిద్యాలయంలో అమలు చేసిన సంస్కరణల గురించి ఉపకులపతి అల్దాస్ జానయ్య వివరించారు. సీట్ల పెంపు, ఫీజుల తగ్గింపుతో పాటు కొత్త కళాశాలల ఏర్పాటు, కొత్త కోర్సులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. వ్యవసాయ కూలీల పిల్లలకు 15 శాతం సీట్లు కేటాయించామన్నారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం ద్వారా సుమారు 3,20,000 మంది రైతులను నేరుగా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు కలిశారని జానయ్య వివరించారు.

జానపద జాతరకు కేటీఆర్‌కు ఆహ్వానం

తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన కళాకారుల ఆటపాటలతో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో త్వరలో సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న 'జానపద జాతర' కార్యక్రమానికి హాజరుకావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణకర్‌తో పాటు కార్యవర్గ సభ్యులు కేటీఆర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ కళాకారులతో ఆప్యాయంగా మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కళాకారుల పాత్ర ఎంతో కీలకమైందని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జానపద కళలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కళాకారుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. సిరిసిల్లలో నిర్వహించనున్న జానపద జాతర కార్యక్రమానికి తన సహకారం అందిస్తానని, కార్యక్రమం విజయవంతమయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం జానపద జాతర నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన కళాకారులు పాల్గొనే ఈ కార్యక్రమం తెలంగాణ జానపద కళలు, సంస్కృతి, సంప్రదాయాలకు వేదికగా నిలవనుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణకర్, ప్రధాన కార్యదర్శి ఎండీ సత్తం పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కమిటీ..



ములుగు అక్టోబర్ 22 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ములుగు జిల్లాలో నూతనంగా ఏర్పడిన తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) జిల్లా కార్యవర్గ సభ్యులు గురువారం జిల్లా ఎస్పీ కేక న్ సుధీర్ రామ్నాథ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ నూతన కమిటీ సభ్యులకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం తన చాంబర్లో జర్నలిస్టుల సమస్యలు మీడియా భద్రత. సమాచార అందుబాటుపై చర్చించారు. సమాజంలో వాస్తవాలను నిర్భయంగా ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. చట్ట పరిధిలో జర్నలిస్టులు విధులు నిర్వహిం చేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా పోలీస్ శాఖ కలసి పనిచేయాలని సూచించారు. జర్నలి స్టులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి తాను అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా టీజేఏ నూతన కమిటీ సభ్యులు ఎస్పీ కి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీ ని కలిసిన వారిలో టీజేఏ ములుగు జిల్లా అధ్యక్షుడు భేతి సతీష్ యాదవ్. ప్రధాన కార్యదర్శి. ఎనగం దుల కొమరయ్య. ఉపాధ్యక్షుడు. చల్ల గురుకుల రాజు. కోశాధికారి సంఘు రంజిత్ కుమార్. సభ్యుడు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక..



మంగపేట, అక్టోబర్ 22(సూర్యోదయ వార్త.)

ములుగు జిల్లా మంగపేట మండలంలోని తిమ్మంపేట ఆవాస ప్రాంతమైన బీసీ కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి నూతన ఆలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ, భక్తులకు సౌకర్యాల కల్పనే ధ్యేయంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు సభ్యులు తెలిపారు.నూతన కార్యవర్గ సభ్యులు గౌరవ అధ్యక్షులుగా గుండు నర్సయ్య, బసరికాని హరికృష్ణ ,అధ్యక్షులుగా చిటమట రాజశేఖర్,ఉపాధ్యక్షులుగా రెడ్డి పవన్ ,కార్యదర్శిగా బొలుగొద్దు సందీప్,?ప్రధాన కార్యదర్శిగా ముక్కెర రాజు,కోశాధికారి బోగా భగత్,ప్రచార కార్యదర్శిగా మల్యాల కమలాకర్,గౌరవ సలహాదారులుగా కొండా ముసలయ్య, లొటపెట్టల బిక్షపతి, అమిలి చంద్రంలు,కార్యవర్గ సభ్యులుగా ముక్కెర రజినీకాంత్, కోటి రామ్, పూజారి ప్రసాద్, కేక్కం జగదీశ్ లను ఎన్నుకొన్నారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ... గ్రామ ప్రజలు, భక్తుల సహకారంతో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని, భక్తి కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహిస్తామని పేర్కొన్నారు..

ఘనంగా కొమురం భీం 125 జయంతి...

- మంగపేట మండల ఆదివాసి ప్రజాసంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ..



మంగపేట. ములుగు జిల్లా. అక్టోబర్ 22(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

మన్యం వీరుడు, నిజాం పాలనలో ఆదివాసీ ప్రజల పై ఉన్న నిర్భంధాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన కుమురం భీమ్ మరియు ఎస్సీ ఎస్టీ ల అభ్యున్నతి కోసం కృషి చేసి, ఎన్నోపథకాలను రూపొందించిన, నిస్వార్థ, నిరాడంబర ప్రజాసేవకుడు, దివంగత ఐఏఎస్ అధికారి ఎస్సార్ శంకరన్ గార్ల జయంతి సందర్భంగా ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఆదివాసీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు కొండ చెంచయ్య అధ్యక్షతన ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు గొప్ప సమ్మారావు, మాట్లాడుతూ కుమురం భీమ్ పోరాటాల ఫలితంగా సాధించబడిన హక్కులను కాపాడుకోవాల్సిన భాద్యత ఆదివాసీ యువత పై ఉన్నదన్నారు. నిజాం భూమి, అడవి పై విధించిన పన్నులకు వ్యతిరేకంగా ఆదివాసీ సమాజాన్ని ఏకం చేసిన గొప్ప నాయకులు కొమురం భీమ్ అని, కుమురం భీమ్ పోరాటాల స్ఫూర్తితో ఆదివాసీ చట్టాల అమలుకోసం ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రంలో ఆదివాసీ ఉద్యోగుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి మద్దెల అంజయ్య, ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు తాటి నాగరాజు, తోలెం రామకృష్ణ, ఎట్టి సారయ్య, తోలేం సుధాకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టి సెల్ అధ్యక్షులు అయ్యోరి యానయ్య, మండల అధ్యక్షులు చెట్టుపెల్లి వెంకటేశ్వర్లు, సిపిఎం మండల కార్యదర్శి ముత్యాలు మరియు ఆదివాసి నాయకులు కోరెం మొగిలి, గట్టుపల్లి అర్జున్, కొమరం రవికుమార్, గొప్ప చంద్రకాంత్, పాయం వికాస్, సోలం వెంకటేశ్వర్లు, ఈసం కృష్ణ, గాజ సమ్మయ్య, పూనెం నరసయ్య తదితరులు పాల్గొన్నారు..

నిత్యావసర సరుకుల ధరలకు రెక్కలు..!

- ములుగు జిల్లాలో సామాన్యుడిపై ధరల భారం
- కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు!
- ధరల పెరుగుదలతో పేద, మధ్యతరగతి కుటుంబాల సతమతం
- అక్రమ నిల్వలపై అధికారులు దృష్టి సారించాలి





ములుగు.అక్టోబర్ 22 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ఒకవైపు నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతుండగా, మరోవైపు కుటుంబ ఖర్చులు భరించలేక సామాన్య ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ములుగు జిల్లా పరిధిలో ఉన్న అన్ని మండలాల్లో బియ్యం, పప్పులు, వంటనూనె, ఉప్పు తదితర నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే పెరిగిన ఖర్చులతో సతమతమవుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు నిత్యావసర సరుకుల కొనుగోలు భారంగా మారుతోంది.

రోజువారీ కూలీ ఆదాయం.. పెరుగుతున్న కుటుంబ ఖర్చులు!.

రోజంతా కష్టపడి సంపాదించే కూలీ డబ్బులతో కుటుంబాన్ని పోషించుకోవడమే కష్టంగా మారిన పరిస్థితుల్లో, నిత్యావసర వస్తువుల ధరలు మరింత భారాన్ని మోపుతున్నాయి. బియ్యం, పప్పులు, వంటనూనె వంటి ప్రతి ఇంటికీ అవసరమైన వస్తువుల ధరలు పెరిగితే దాని ప్రభావం నేరుగా సామాన్యుడి వంటగదిపై పడుతుంది. నెలవారీ బడ్జెట్ తారుమారవడంతో కుటుంబ అవసరాలను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు..!

ములుగు జిల్లా కేంద్రంలో ఉన్న అన్ని మండలాల్లో కొంతమంది వ్యాపారులు నిత్యావసర సరుకులను నిల్వ ఉంచి, మార్కెట్‌లో కొరత ఏర్పడిన తర్వాత అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సరుకుల కొరతను ఆసరాగా చేసుకుని లాభాలు పొందేందుకు ప్రయత్నిస్తే దాని భారం చివరకు వినియోగదారులపైనే పడుతుంది. అయితే అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించడం వంటి అంశాలపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

అధికారుల పర్యవేక్షణ ఏది?

నిత్యావసర సరుకుల ధరలు, నిల్వలు, సరఫరాపై సంబంధిత శాఖల పర్యవేక్షణ నిరంతరం కొనసాగాలి. ముఖ్యంగా పౌరసరఫరాల శాఖ, తూనికలు--కొలతల శాఖ, సంబంధిత తనిఖీ అధికారులు దుకాణాలను తనిఖీ చేసి సరుకుల నిల్వలు, కొనుగోలు బిల్లులు, విక్రయ ధరలను పరిశీలించాలి. చట్టవిరుద్ధంగా నిల్వలు ఉంచడం, తప్పుదారి పట్టించే ధరలకు విక్రయించడం వంటి ఉల్లంఘనలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.

ప్రజలకు అందుబాటులో ధరలు ఉండేలా చర్యలు తీసుకోవాలి..

మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం, సరఫరాలో అంతరాయాలు ఉన్నాయా లేదా పరిశీలించడం, వినియోగదారుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం అత్యవసరం. అధిక ధరలకు సరుకులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే ప్రజలు కొనుగోలు బిల్లులతో సహా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి.

సూర్యోదయవార్త ప్రత్యేక కథనం:.

నిత్యావసర సరుకులు ప్రజలకు విలాస వస్తువులు కావు.. అవి ప్రతి కుటుంబానికి ప్రాథమిక అవసరాలు. మార్కెట్‌లో ధరల పెరుగుదలకు నిజమైన కారణా లేమిటి? సరఫరాలో కొరత ఉందా? ఎక్కడైనా అక్రమ నిల్వలు జరుగుతున్నాయా? అనే అంశాలపై అధికారులు పారదర్శకంగా విచారణ జరపాలి. వ్యాపారులకు న్యాయమైన లాభం లభించడంతో పాటు వినియోగ దారులకు సరుకులు అందుబాటు ధరల్లో లభించేలా చర్యలు తీసుకోవాలి. మణుగూరు పట్టణ ప్రజలపై ధరల భారం తగ్గించేందుకు సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు..

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి..
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి - దనసరి అనసూయ సీతక్క





ములుగు. అక్టోబర్ 22(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

నూతనంగా నిర్మిస్తున్న మోడల్ బస్‌స్టాండ్ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి అనసూయ సీతక్క ములుగు జిల్లా కేంద్రంలోని మోడల్ బస్‌స్టాండ్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఫ్లోరింగ్, నిర్మాణ పనులతో పాటు ఇతర పనుల పురోగతిని పరిశీలించి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలిన పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసు కున్నారు.ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడంలో బస్‌స్టాండ్ కీలకమని తెలిపారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. పనుల వేగంతో పాటు నాణ్యతకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ప్రయాణికులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా ఫ్లోరింగ్ పనులు చేపట్టాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునే సదుపాయాలు, విద్యుత్ దీపాలు వంటి మౌలిక సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మిగిలిన పనులను సమన్వ యంతో పూర్తి చేసి, బస్‌స్టాండ్‌ను ప్రజలకు అందు బాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికా రులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి,పంచాయతీ రాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి,స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు...

భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి పక్కా ప్రణాళిక రూపొందించాలి

- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలి
- పాత భూభారతి దరఖాస్తులకు నవంబర్ 15 గడువు
- కొత్త దరఖాస్తులను 30 రోజుల్లోగా పరిష్కరించాలి..
- భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేశ్ కుమార్.



ములుగు. అక్టోబర్ 22(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి పక్కా ప్రణాళిక రూపొందించి, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ జిల్లా అదనపు కలెక్టర్లను ఆదేశించారు.గురువారం భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేశ్ కుమార్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.భూముల రీ సర్వే, బృందాల ఏర్పాటు, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, హైకోర్టు కేసులు, భూసేకరణ, ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 59 కింద క్రమబద్ధీకరణ దరఖాస్తులు, భూదాన్ భూములపై సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా లోకేశ్ కుమార్ మాట్లాడుతూ పాత భూభారతి విధానంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ నవంబర్ 15లోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. కొత్త భూభారతి విధానంలో అందే దరఖాస్తులను స్వీకరించిన తేదీ నుంచి 30 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ నిర్దిత గడువులను పాటించాలని సూచించారు.రీ సర్వే పురోగతి, ఇందుకు అవసరమైన బృందాల ఏర్పాటుపై సమీక్షించారు. రీ సర్వే పనులు సక్రమంగా సాగేందుకు బృందాల ఏర్పాటుపై దృష్టి సారించాలని తెలిపారు. భూదాన్ భూములు, భూసేకరణ అంశాలు, హైకోర్టు కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 59 కింద పెండింగ్‌లో ఉన్న క్రమబద్ధీకరణ దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, డిప్యూటీ తహసీల్దార్ నితీష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు..

దేశం, ధర్మం కోసం ప్రతీ ఒక్కరూ నిలబడాలి..

విద్యాభారతి నేత సుధాకర్ రెడ్డి

ములుగు, అక్టోబర్ 22(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

పౌరులందరూ దేశం, ధర్మం కోసం నిలబడాలని, విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని, నైతిక విలువలను పెంపొందించాలని విద్యాభారతి అఖిల భారత ప్రచార ప్రముఖ్ లింగం సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. విజయాదశమిని పురస్కరించుకుని ధర్మజాగరణ ఉత్సవ సమితి అధ్యక్షుడు గంద్రకోట కుమార్ ఆధ్వర్యంలో ములుగు జిల్లా కేంద్రంలో 'రావణాసుర వధ' కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.కేవలం ఉద్యోగాలు, సంపాదన మాత్రమే విద్య లక్ష్యం కాదని, సమాజానికి ఉపయోగపడే పౌరులను తయారు చేయడమే అసలైన విద్య అని పేర్కొన్నారు. పిల్లల సందేహాలను నివృత్తి చేస్తూ వారిలో ఆలోచనా శక్తిని, జిజ్ఞాసను



పెంచాలని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు సూచించారు. శ్రీరాముడి జీవితం త్యాగం, కుటుంబ అనుబంధాలకు నిదర్శనమని, అధర్మ మార్గంలో నడవడం వల్లే రావణాసురుడి పతనం జరిగిందని వివరించారు. రామాయణ, మహాభారతాల ద్వారా పిల్లలకు నైతిక విలువలు నేర్పాలన్నారు.రాజకీయ పార్టీలు సంతుష్టీకరణ, కులమతాల ఆధారిత విభజన విధానాలను విడనాడాలని పిలుపునిచ్చారు. తప్పు జరిగితే రాజకీయాలకు అతీతంగా ప్రశ్నించే ధైర్యం ప్రజల్లో ఉండాలని అన్నారు.ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన జానపద కళారూపాలు, మిమిక్రీ, అద్భుత ఫైర్ వర్క్స్ ప్రదర్శనలు భక్తులను విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, కమిటీ సభ్యులు మరియు వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా కొమరం భీమ్ 125 జయంతి వేడుక..

- విగ్రహానికి పూలమాలలు వేసిన ఆదివాసీ నాయకులు..
- షెడ్యూల్ చట్టాలను అమలు చేయాలి..
- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఆదివాసీ సంఘాల నాయకులు..





వెంకటాపురం. నూగూర్ అక్టోబర్22(సూర్యోదయ వార్త)

ఆదివాసీల ఆరాధ్య దైవం నిజాం నిరంకుశ విధానాలను ఎదిరించి పోరాడి ఆమరుడైన కొమరం భీమ్ జయంతి వెంకటాపురం మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కొమరం భీమ్ విగ్రహానికి నాయకులు పూనెం సాయి, కొర్స నర్సింహా మూర్తి, వాసం నాగరాజు, పర్షిక సతీష్, పూనెం ప్రతాప్ పూలమాలలు వేసినారు. కొమరం భీమ్ భూమి, నీరు, అడవి ల పైన ఆదివాసీలకు హక్కులు కల్పించాలని నిజాం ప్రభుత్వం తో అలుపెరుగని పోరాటం చేసినట్టు నాయకులు తెలిపారు. కొమరం భీమ్ పోరాటం వల్లనే నేడు ఆదివాసీలకు చట్టభద్ధమైన హక్కులు లభించాయని అన్నారు. నేడు ఆ చట్టాలు అమల్లో పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నట్టు వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొమరం ఆశయ సాధనకు ఆదివాసీలు పాలక ప్రభుత్వాల పైన పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల పైన అణచివేత విధానాలు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిజాం విధానాలను అనుసరిస్తున్నట్టు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు కొమరం ఆశయాలను సాధిద్దాం అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు కుంజ మహేష్ కంతి విజయ్ , వాసం నారాయణ, కంతి శంకర్, ప్రశాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు...

వాజేడులో ఘనంగా కొమరం భీమ్ జయంతి వేడుకలు..

కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసిన ఆదివాసి నాయకులు..





వాజేడు. ములుగు జిల్లా అక్టోబర్ 22(సూర్యోదయ వార్త)

– ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలోని గురువారం కొమరం భీమ్ 125 వ జయంతి సందర్భంగా జేఏసీ ఆధ్వర్యంలో కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేశారు . ఈ సందర్భంగా ఆదివాసి నవనిర్మాణ సేనా ములుగు జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్ మాట్లాడుతూ ఆదివాసీల అస్తిత్వం కోసం మరియు జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో కొమరం భీమ్ ఆదివాసీల కోసం పోరాటం చేశారు ఇప్పుడు మనం మనకోసం సాధించిన 1/70 చట్టం మరియు పీసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేసే వరకు నిరంతర పోరాటాలు చేయాలని ఆదివాసీలందరికి పిలుపునిచ్చారు.5 వ సెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్నటువంటి చట్టాలను పటిష్టంగా అమలుపరచాలని అన్నారు . ఈ కార్యక్రమంలో ఏ ఎన్ ఎస్ ఆదివాసి నవనిర్మాణ సేనా సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్, ఏ ఎన్ ఎస్ మండల కార్యదర్శి యలం అశోక్, తల్లడి నానబాబు యలం.సుబ్బయ్య తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి పాయం జానకిరావు,సంతోష్ ఆదివాసి సంక్షేమ పరిషత్ టింగా బుచ్చయ్య ఆదివాసీ నాయకులు కారం తేజ, మొండెం సరిత, మొండెం సతీష్, వుయిక రిషిరామ్ యశోద ,శిరీష సారబాబు.తుడుందెబ్బ విద్యార్ధి సంఘం నాయకుడు పాయం పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు..

కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తల కుటుంబాలకు మంత్రి సీతక్క ఆర్థిక సాయం..

- ఒకే కుటుంబంలో నెల రోజుల వ్యవధిలో ఇద్దరు అన్నదమ్ములు మరణించడం బాధాకరం.
- మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు.
- బుచ్చంపేటలో పత్తి రామచంద్రయ్య, వీరస్వామి కుటుంబాలకి పరామర్శ.
- దశదినకర్మల ఖర్చుల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సాయం

మంగపేట. ములుగు జిల్లా. అక్టోబర్ 22 (సూర్యోదయ వార్త)

ములుగు జిల్లా మంగపేట మండలంలోని బుచ్చంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త పత్తి రామచంద్రయ్య ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి ఆయన



నివాసానికి వెళ్లి,చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సహకారంతో పత్తి రామచంద్రయ్య దశదినకర్మల ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు.అదేవిధంగా,గత నెల రోజుల క్రితం పత్తి రామచంద్రయ్య సోదరుడు పత్తి వీరస్వామి మరణించిన సందర్భంలోనూ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.సీతక్క చొరవతో ఆ కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సాయాన్ని అందించారు.ఈ విధంగా ఒకే కుటుంబంలో వరుసగా విషాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ,కష్టకాలంలో వారికి ఆర్థిక సహాయం అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు,యువజన కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల నరేష్,అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జంగం భాను చందర్,జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఏంపెల్లి సమ్మయ్య,సీనియర్ నాయకులు పల్లె శోభన్ బాబు,రాచకొండ సోమయ్య,గడ్డం శ్రీహరి,పొన్నాల కొండల రెడ్డి,దార ధర్మయ్య,గడ్డం పరమేష్,ధర్మారపు యాకయ్య,ధర్మారపు సాయిలు,కాటూరి రాజు,ఎడ్ల నవీన్,నాలి రాంబాబు,పగిడిపల్లి రవి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు...

అమరుల త్యాగాలు చిరస్మరణీయం..

మంగపేటలో పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా కొవ్వొత్తుల ర్యాలీ.

ములుగు జిల్లా. మంగపేట అక్టోబర్ 22(సూర్యోదయ వార్త)

శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని మంగపేట ఎస్సై టి.వి.ఆర్.సూరి పేర్కొన్నారు. అక్టోబర్ 21న 'పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం' సందర్భంగా తెలంగాణ పోలీసు శాఖ పిలుపు మేరకు ఈ నెల 21 నుండి 31 వరకు నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా గురువారం సాయంత్రం మంగపేటలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.మంగపేట పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ తెలంగాణ సెంటర్ వరకు



సాగింది. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలు, కొవ్వొత్తులతో ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానికులు అమరుల త్యాగాలను స్మరించుకుంటూ ఘన నివాళు లర్పించారు.

అమరవీరుల స్ఫూర్తితోనే ముందడుగు..

ఈ సందర్భంగా ఎస్సై టి.వి.ఆర్.సూరి మాట్లాడుతూ.. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఎన్నో సవాళ్లను ధీటుగా ఎదుర్కొని, ప్రాణాలను సైతం లెక్కచేయక విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు ప్రతీ ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రాణత్యాగం చేసిన వీరులు ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతారన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. విధి నిర్వహణలో ఎన్నో జటిలమైన సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, అమరులందించిన స్ఫూర్తితోనే ప్రజల భద్రత, రక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో సెకండ్ ఎస్సై లంకదాసరి శ్రీకాంత్, సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది, కానిస్టేబుళ్లు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ములుగుజిల్లా పరిధిలో జాకారంలో గత 20రోజుల్లో కరెంట్ ఉచ్చులో ఇద్దరు బలి..

ములుగు అక్టోబర్ 22 సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ములుగు పరిధిలో గల జాకారం లో వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తున్న ఇద్దరు రైతులను కరెంటు ఉచ్చులో బలి అయినారు.అదే వ్యవసాయం పై ఆధారాపడి జీవిస్తున్నతోటి రైతులు చేతికి అందవచ్చే పంటలుజీవ రాసులు విధ్వంసం చేయడంవలన పంటలకు తీవ్రనష్టం జరుగుతుంది. ఈలాంటి పరిస్థితి లో రైతులు పంటలను రక్షించు కొనుటకు పొలాల చుట్టూ విధ్యుత్ తీగలను అమర్చటం వలన విధ్యుత్ తీగలను తోటి రైతులు అది గమనించకపోవటం వలన యిరైతులు విధ్యుత్ సరఫరా ఉండటం వలన విధ్యుత్ షాక్ గురై చనిపోవటం జరుగుతున్నది.విధ్యుత్ అదుకారుల నిర్లక్ష్యం ఇటు ప్రభుత్వం అటు అటవీశాఖ అధికారులు రైతులకు,అటవీ



జీవరాసులనుండి పంటలకు మరియు రైతులకు ఇలాంటీ పరిస్థితులు భవిష్యత్ లో రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అలాగే మరణించిన రైతులకు రైతుభీమా మరియు పంటల నష్టానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి రైతంగా సంఘం, ప్రజలు కోరుతున్నారు..

మంగపేటలో ఘనంగా కొమరం భీమ్ 125వ జయంతి వేడుకలు

- కొమరం భీమ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలి:
- మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు

మంగపేట, ములుగు జిల్లా అక్టోబర్ 22:(సూర్యోదయ వార్త.)

ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కొమరం భీమ్ 125వ జయంతి కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మరియు ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య ముఖ్య అతిథిగా హాజరై బస్టాండ్ ఎదురుగా ఉన్న కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు..ఈ సందర్భంగా ముఖ్య అతిథులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు,అయ్యోరి యానయ్య మాట్లాడుతూ,ఆదివాసీల హక్కుల సాధన కోసం కొమరం భీమ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు."జల్,జంగల్,జమీన్"(నీరు,అడవి,భూమి) అనే నినాదంతో పాటు "మా పాలన -- మా రాజ్యం" అనే ఆశయంతో ఆదివాసీ సమాజాన్ని ఏకం చేసి,వారి హక్కుల కోసం పోరాటం చేసిన గొప్ప ఉద్యమ నాయకుడని కొనియాడారు.కొమరం భీమ్ చూపిన మార్గంలో పయనిస్తూ,ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు.ఆదివాసీల





హక్కులు,ఆత్మగౌరవం,సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాట స్ఫూర్తిని నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ భద్రాచల సీతరామ చంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్, మాజీ మండల అధ్యక్షులు మైల జయరాం రెడ్డి,ఏటూరు నాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు తుడి భగవాన్ రెడ్డి,మండవ రామక్రిష్ణ,అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జంగం భానుచందర్,మైనారిటీ సెల్ అధ్యక్షులు హిదయతుల్ల,శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన చైర్మన్ యర్రంగారి సురేష్,ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మూగల చంటి,యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా ఇంచార్జీ భూక్యా కుమార్,నాయకులు కొమురం లక్ష్మీపతి,ఎట్టి సారయ్య,బొంబోతుల మురళి,బండపెల్లి నర్సయ్య, పట్టెం పగిడీ,మద్దేవేని రాజు తదితరులు పాల్గొన్నారు..



అఖి నేపల్లి మల్లారంలో రైతుల సమైక్య సమావేశం...

ధాన్యం కొనుగోలు సమస్యలు వ్యాపారుల ఒత్తిళ్లపై రైతులు చర్చించారు.

మంగపేట. ములుగు జిల్లా. అక్టోబర్ 22(సూర్యోదయ వార్త.)

ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని అఖి నేపల్లి మల్లారం లో గురువారం రైతుల సమైక్య సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు సమ స్యలు వ్యాపారుల ఒత్తిడి పై చర్చించారు. ఎరువులు. పురుగు మందులు కొనుగోలు చేసినప్పుడు వ్యాపా రులు. బిల్లులు.. రసీదులు ఇవ్వడం లేదని రైతులు ఆరోపించారు. తాము పెట్టుబడులు పెడుతున్నామనే కారణంతో తమ వద్ద ధాన్యం ఇతర పంటలు ఉత్ప త్తులను వ్యాపారులు నిర్ణయించిన ధరకే విక్ర యించాలని ఒత్తిడి చేస్తున్నారని రైతులు తెలిపారు..

మారుమూల గ్రామ గిరిజన యువతికి సన్మానం...

తాడ్వాయి. ములుగు జిల్లా. అక్టోబర్ 22

(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)



– ములుగు జిల్లా తాడ్వాయి మండలం రంగాపూర్– కొత్త పెళ్లికి చెందిన ఇరుప నారాయణ – ఈశ్వరి దంపతుల కుమార్తె సాహితి నీట్ లో 1457 వ ర్యాంకు సాధించి. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ చదువుతోంది. ఆర్థిక ఇబ్బందులతో తండ్రి ఉన్నత చదువులకు దూరమైన పిల్లలను ఉన్నంత గా చదివించాలని పట్టుదలతో కృషి చేశారు. కుమార్తె డాక్టర్ అవడంతో తల్లిదండ్రులు గ్రామస్తులు సాహితీనీ శాలువాతో ఘనంగా సన్మానించారు.

భోగి' సినిమా నుంచి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటే సాంగ్

చార్మింగ్ స్టార్ శర్వా పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటోంది. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 1960ల ప్రారంభంలో మహారాష్ట్ర?ఆదిలాబాద్ సరిహద్దు నేపథ్యంలో సాగుతుంది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తుండగా, లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. గ్రామీణ సంప్రదాయాలు, మానవ సంబంధాలు, సామాజిక పరిస్థితులతో ముడిపడిన సహజమైన పల్లెటూరి ప్రపంచాన్ని ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్ మంచి ఆసక్తిని రేకెత్తించగా, తొలి పాట 'ఎగిలివారంగ' సినిమాలోని పల్లె వాతావరణంతో కూడిన సంగీత ప్రపంచాన్ని పరిచయం చేసింది. దసరాకు ఒక రోజు ముందు మేకర్స్ ఈ సినిమా నుంచి రెండో పాట 'అన్నయ్య పానం' ను విడుదల చేశారు. ఐదుగురు చెల్లెళ్లపై ఒక అన్నయ్య చూపించే నిస్వార్థమైన ప్రేమ, ఆప్యాయతలను హృద్యంగా ఆవిష్కరించే ఈ పాటతో పాటు, ప్రధాన జంట ప్రేమకథకు సంబంధించిన కొన్ని అందమైన క్షణాలను కూడా చూపించారు. పల్లెటూరి మట్టి వాసనతో కూడిన పాటలను అందించడంలో ప్రత్యేకత కలిగిన సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ పాటను మనసు ఆకట్టుకునేల స్వరపరిచారు.భావోద్వేగాల లోతుతో సాగే ఈ మెలోడీ వినగానే ఆకట్టుకుంటుంది. ఆస్కార్ విజేత, గీత రచయిత చంద్రబోస్ సాహిత్యంతో పాటకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చారు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే అనురాగం, త్యాగం, విడదీయలేని అనుబంధాన్ని తన సాహిత్యంలో అందంగా ఆవిష్కరించారు.

సింగర్ శ్రీకృష్ణ తన వోకల్స్ తో ఈ పాటకు ప్రాణం పోశారు. ఆయన వాయిస్ పాటలోని భావోద్వేగాలను మరింత పెంచుతుంది. కథలోని రొమాంటిక్ కోణాన్ని కూడా ఈ పాట ఆవిష్కరిస్తుంది. శర్వా, అనుపమ పరమేశ్వరన్ పాత్రల మధ్య కెమిస్ట్రీని అందంగా చూపించారు. అనీ మాస్టర్ కొరియోగ్రఫీ పాటలోని భావానికి చక్కగా సరిపోగా, సహజమైన పల్లెటూరి వాతావరణం, ఆప్యాయతతో కూడిన కుటుంబ సన్నివేశాలు విజువల్స్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. పల్లెటూరి యువకుడిగా శర్వా తన సహజమైన లుక్‌తో ఆకట్టుకున్నారు. నిజాయితీతో కూడిన నటనతో తన పాత్రకు భావోద్వేగాల లోతును జోడించారు. పాటలో ప్రధానంగా కనిపించే అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ఆయన నటన మరింత సహజత్వాన్ని తీసుకొచ్చింది. పల్లెటూరి అమ్మాయిగా అనుపమ పరమేశ్వరన్ అందంగా ఆకట్టుకున్నారు. అద్భుతమైన నటన, మనసును తాకే సాహిత్యం, అందమైన విజువల్స్ కలగలిసి ఈ పాటను 'భోగి' సంగీత ప్రయాణంలో గుర్తుండిపోయే పాటగా నిలబెట్టాయి. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్‌తో పాటు డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. కిశోర్ కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. ఈ సినిమా రిలీజ్ డేట్‌ను త్వరలో ప్రకటించనున్నారు. నటీనటులు: చార్మింగ్ స్టార్ శర్వా, అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి





'ఆది రుద్ర' సినిమా పోస్టర్ మోషన్ వీడియో రిలీజ్

ఆది సాయికుమార్ హీరోగా త్రిశూల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రంతో ఆసక్తికరమైన ప్రయాణాన్ని ప్రారంభిస్తోంది. దైవిక , అతీంద్రియ రహస్యాలు, ఉత్కంఠభరితమైన సస్పెన్స్ కలగలిసిన కథాంశంతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ప్రశాంత్ జి. రుద్రప్ప నిర్మిస్తున్న ఈ చిత్రానికి నవరసన్ కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. దసరా పర్వదినం సందర్భంగా మేకర్స్ ఈ సినిమాకు పవర్‌ఫుల్ టైటిల్‌ను ప్రకటిస్తూ ఆకట్టుకునే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి 'ఆది రుద్ర' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్ పోస్టర్‌లో ఆది సాయికుమార్ త్రిశూలం పట్టుకుని, వెనక్కి తిరిగి నిలబడిన తీరు ఆకట్టుకుంటోంది. లో యాంగిల్‌లో రూపొందించిన ఈ కంపోజిషన్ ఆయన ఇంటెన్స్ ప్రజెన్స్ మరింత ప్రభావవంతంగా చూపిస్తోంది. ఆకాశాన్ని తాకేలా కనిపించే భారీ పర్వతాకార నిర్మాణంపై దుర్గామాత రూపం దర్శనమిస్తోంది. మరోవైపు, వెలుగుతున్న కాగడాలు పట్టుకున్న భారీ జనసమూహం వృత్తాకారంలో ఉన్న యజ్ఞస్థలాన్ని చుట్టుముట్టిన దృశ్యాలు పోస్టర్‌కు మరింత మిస్టరీని జోడిస్తున్నాయి. మనిషికి, అతీంద్రియ ప్రపంచం పథ్యంలో ఈ కథ సాగనుందనే ఆసక్తిని ఈ విజువల్స్ కలిగిస్తున్నాయి. 1960ల నుంచి 1990ల మధ్య కాలంలో జరిగే కథతో 'ఆది రుద్ర' తెరకెక్కుతోంది. ఈ ప్రత్యేకమైన పీరియడ్ నేపథ్యం సినిమాలోని పాత్రలు, విజువల్ స్టైల్, ఆ కాలం నాటి వాతావరణాన్ని మళ్లీ సృష్టిస్తూ, ఆసక్తికరమైన దైవిక రహస్యాన్ని మిళితం చేసి ప్రత్యేకమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించాలనేది మేకర్స్ లక్ష్యం. ఈ చిత్రానికి ఏజే శెట్టి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. 'కాంతార', 'విరూపాక్ష', 'మంగళవారం', తమిళ బ్లాక్‌బస్టర్ 'మహారాజా' చిత్రాలతో గుర్తింపు పొందిన ప్రముఖ సంగీత దర్శకుడు బి. అజనీష్ లోక్‌నాథ్ ఈ సినిమాకు సంగీతం సమకూరుస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. మోషన్ వీడియోకు ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ డివైన్ వైబ్ ను అద్భుతంగా ఆవిష్కరిస్తోంది.



30న వస్తున్న 'ఆదర్శ కుటుంబం'

అగ్ర హీరో వెంకటేష్ అంటేనే కుటుంబ కథా చిత్రాలకు పెట్టింది పేరు. ఇక మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కలం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దాదాపు ఇరవైఏండ్ల తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'ఆదర్శ కుటుంబం-హౌస్ నంబర్ 47 (ఏకే 47)'. కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు, హాస్యం, యాక్షన్ కలబోతగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం బుధవారం ప్రకటించింది. ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, కుటుంబ ప్రేక్షకులు మెచ్చే సంపూర్ణ వినోదాత్మక చిత్రమిదని మేకర్స్ తెలిపారు. శ్రీనిధిశెట్టి, నారా రోహిత్, నివేదా పేతురాజ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి నిర్మాత: ఎస్.రాధాకృష్ణ (చినబాబు), సంగీతం: తమన్, రచన-దర్శకత్వం: త్రివిక్రమ్ శ్రీనివాస్

దుష్ట శిక్షణలో కనకదుర్గ

నిధి అన్వేషణ ప్రధాన ఇతివృత్తంగా రూపొందిస్తున్న చిత్రం 'సన్ ఆఫ్ కనకదుర్గమ్మ'. లయ, అనురూప్ కటారి, ఆకాంక్ష త్యాగరాజన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి దుర్గ ఫణిందర్ దర్శకుడు. దసరా సందర్భంగా ఈ సినిమా స్పెషల్ పోస్టర్‌ను ప్రముఖ నిర్మాతలు అశ్వనీదత్, స్వప్నదత్ విడుదల చేశారు. ఇందులో నటి లయ అమ్మవారి అవతారంలో శక్తివంతంగా కనిపిస్తున్నారు. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగే ఈ కథలో విజువల్స్, యాక్షన్ ఘట్టాలు ప్రత్యేకాకర్షణగా నిలుస్తాయని, దుష్టశిక్షణ గావించే అమ్మవారి అవతారంలో లయ కనిపించే సన్నివేశాలు ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందిస్తాయని చిత్రబృందం పేర్కొన్నది. ఈ చిత్రానికి సంగీతం: శశిధర్ లంక, కథ: కాకర్ల గోవర్ధన రావు, నిర్మాతలు: వాణి శంకర్, తిలోత్తమ, దర్శకత్వం: దుర్గ ఫణిందర్ లంక.

